సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 23 । నవంబర్ । 2023



సేవాలయాలు IIIలో



బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రమాదంలో ఆహుతైన చిన్నారి నిత్య కుటుంబాన్ని ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి పరామర్శించారు. IIIలో



వైభవంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది.

న్యూస్‌రీల్

ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం

• పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశం

అరకులోయ రూరల్: ఓటరు నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజలకు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. పెండింగ్‌పనులు గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

మారేడుమిల్లి : ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్‌జీసీ) కాకినాడ ఆధ్వర్యంలో ఈ నెల 24 తేదీన స్థానిక యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీర కిషోర్ బుధవారం తెలిపారు. రాజమహేంద్రవరం పరమహంస యోగనంద నేత్రాలయం ఆస్పత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు ఈ వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. మండలానికి చెందిన ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

న్యాయమూర్తికి పదోన్నతి

• సత్కరించిన న్యాయవాదులు



న్యాయమూర్తి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

చింతపల్లి రూరల్: స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎస్.శ్రీనివాస్ పదోన్నతిపై సీనియర్ జడ్జిగా నెల్లూరు బదిలీ అయ్యారు. ఆయన బాధ్యతలను నర్సీపట్నం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్. మధుసూదనరావుకు అప్పగించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను కోర్టులో న్యాయవాదులు బుధవారం ఘనంగా సత్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రావాడ సత్యనారాయణ, న్యాయవాదులు ప్రకాష్, నాయుడు, గిరి, గోవింద్, రామరాజు పాల్గొన్నారు.

రూ.50 వేల విలువైన కలప పట్టివేత



కలపను డిపోకు వాహనంలో తరలిస్తున్న అటవీ సిబ్బంది

కొయ్యూరు: చెట్లు నరికి తరలించేందుకు సిద్ధంగా ఉంచి రూ.50వేల విలువైన గన్నెర కలపను పెదవలస రేంజర్ జగదీష్ ఆధ్వర్యంలో బుధవారం కొయ్యూరు సెక్షన్ అధికారి సింహాద్రి స్వాధీనం చేసుకున్నారు. చింతవానిపాలెం నుంచి జలపాతానికి వెళ్లే దారిలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికేశారు. ఈ సమాచారం తెలుసుకున్న అటవీ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి వాటిని స్వాధీనం చేసుకున్నారు. సరకును కలప డిపోకు తరలించారు. దీనిలో ఎఫ్‌బీవోలు రాజ్‌కుమార్,రాకేష్‌కుమార్ పాల్గొన్నారు.

టీ-20 మ్యాచ్‌లో డిప్యూటీ మేయర్‌కు బాధ్యతలు

విశాఖ విద్య: భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య గురువారం జరిగే టీ-20 మ్యాచ్‌లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌కు ఆహార, పరిశుభ్రత కమిటీ బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపినాథ్ రెడ్డి బుధవారం వెల్లడించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో జరిగిన పలు అంతర్జాతీయ మ్యాచ్‌లు విజయవంతం చేయడంలో డిప్యూటీ మేయర్ తనదైన పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మరోమారు అతనికి బాధ్యతలు అప్పగించారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

హుషారుగా రబీ..



మోదాపల్లి పంచాయతీ గుర్రగరువులో విత్తనాలు జల్లుతున్న గిరి రైతు

• జిల్లాలో 22,083 హెక్టార్లలో సాగుకు సమాయత్తం
• నారుమడుల తయారీలో నిమగ్నం
• అనుకూలంగా వాతావరణ పరిస్థితులు



పాడేరు మండలం వంట్లమామిడి పంచాయతీ నందిగరువు ప్రాంతంలో రబీ నారుమడులు

సాక్షి,పాడేరు: జిల్లాలో రబీసాగు పనుల్లో గిరి రైతులు నిమగ్నమయ్యారు. ఖరీఫ్‌లో వరి పక్వానికి చేరుకోవడంతో లోతట్టు ప్రాంతాల్లో ఇప్పటికే కోతలు పూర్తయ్యాయి. భూములు ఖాళీగా ఉన్నందున రబీ సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పాడేరు, రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో 22,083 హెక్టార్లలో వివిధ రకాల పంటలను సాగు చేస్తుంటారు. వీటిలో వరి తరువాత మినుము, మొక్కజొన్న, పెసలు, రాజ్‌మా, వలిసె పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేసేందుకు గిరి రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. ఈఏడాది మినుము 2,478, మొక్కజొన్న 1374, పెసర 1118 హెక్టార్లలో వేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది.

పెరిగిన రాజ్‌మా విస్తీర్ణం

పాడేరు డివిజన్‌లో రాజ్‌మా సాగు విస్తీర్ణం పెరిగింది. సాధారణ విస్తీర్ణం 8515 హెక్టార్లు కాగా,9,520 సాగు చేపట్టారు. వలిసెలు సాధారణ విస్తీర్ణం 3,991 హెక్టార్లు కాగా ఈ ఏడాది సాగు తగ్గిపోయింది. ఈ పంటకు సంబంధించి 677 హెక్టార్లలో మాత్రమే ఈక్రాప్ నమోదు అయింది. మన్యంలో రబీ సాగుకు సంబంధించి నీటినిల్వలు పుష్కలంగా అందుబాటులో ఉన్నాయి. వాగులు, గెడ్డల నీటి ఆధారం పండిస్తుంటారు.

2,361 హెక్టార్లలో వరి..

జిల్లాలో రబీ వరి సాధారణ విస్తీర్ణం 2,361 హెక్టార్లు. నీటినిల్వలు అందుబాటులో ఉన్నందున అంతకు మించి నాట్లు వేసే అవకాశం ఉంది. సంప్రదాయ విత్తనాలతో నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల మొలకలు వచ్చాయి. గ్రామసచివాలయాల్లోని వ్యవసాయశాఖ అసిస్టెంట్లు రబీకి రైతులకు అవసరమైన సూచనలు అందిస్తున్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



వరి సాగుకు సంబంధించి నారుమడుల తయారీలో గిరిజన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన విత్తనాలను వినియోగించాలి. శుద్ధి చేసిన విత్తనాలను మాత్రమే సాగుకు వినియోగించాలి. ఎకరా సాగుకు సంబంధించి 3 నుంచి 4 సెంట్లలో నారుమడిని సిద్ధం చేసుకోవాలి. వరి విత్తనాలను దూరంగా చల్లాలి. సాగుకు సంబంధించి సందేహాల నివృత్తి, సూచనలకు ఆర్‌బీకేల్లోని వ్యవసాయశాఖ అసిస్టెంట్లను రైతులు సంప్రదించాలి.

– ఎస్‌బీఎస్ నందు, జిల్లా వ్యవసాయాధికారి, పాడేరు

కాఫీ రైతులను మోసగిస్తే చర్యలు



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



హాజరైన అధికారులు

• కలెక్టర్ సుమిత్‌కుమార్
• అధికారుల సమావేశంలో హెచ్చరిక

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో కాఫీ పంట కొనుగోళ్లలో గిరిజన రైతులను మోసంచేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ కాఫీ విభాగం,హార్టికల్చర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాఫీ ఫలసాయం కొనుగోలులో నిజాయితీ,పారదర్శకత ఉండాలన్నారు. కొనుగోళ్లకు సంబంధించి ఎలాంటి అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాఫీ రైతుల నుంచి ఇప్పటివరకు 342 మెట్రిక్ టన్నుల పండ్లను చింతపల్లి మాక్స్ సేకరించిందన్నారు. సుమారు 200 మెట్రిక్ టన్నులకు రూ.కోటి వరకు కాఫీ రైతులకు చెల్లించినట్టు చెప్పారు. మిగతా 142 మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లకు ఈనెల 25వ తేదీ నాటికి పంపిణీ పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. జీసీసీ కొనుగోలు చేస్తున్న కాఫీ రైతుల వివరాలను సేకరించాలన్నారు.ఏజెన్సీలోని రైతు ఉత్పత్తిదారులతోను అధికారులు సమావేశాలు నిర్వహించి,కాఫీ ఫలసాయానికి గిట్టుబాటు ధర కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కాఫీ రైతులు తమ ఫలసాయం, పాచ్‌మెంట్ గింజలను దళారి వ్యాపారులకు అమ్ముకుని మోసపోవద్దన్నారు. తూకంలోను వ్యాపారులు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. కాఫీ పండ్లను సేకరించేందుకు అధికారులు గోనె సంచులను కొనుగోలు చేయాలని ఆదేశించారు. వర్చువల్ విధానంలో ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పాల్గొన్నారు. ఐటీడీఏ ఏపీవో ఎం.వెంకటేశ్వరరావు,కాఫీబోర్డు డీడీ రమేష్,ఐటీడీఏ కాఫీ ఏడీ అశోక్, జిల్లా హార్టికల్చర్ అధికారి పి.రమేష్‌కుమార్‌రావు పాల్గొన్నారు.

30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో పాడేరు డివిజన్ అధికారులతో సమీక్షించారు. చింతూరు,రంపచోడవరం డివిజన్‌ల అధికారులతో వర్చువల్ విధానంలో సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 46 ధాన్యం, 25 రాగుల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు.వరి క్వింటా రూ.2,183తోను రాగులు క్వింటా రూ.3,846 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఐదు వేల మెట్రిక్ టన్నుల రాగుల కొనుగోలుకు నిర్ణయించామన్నారు. వరి కోతలు పూర్తయిన వెంటనే ధాన్యం, ఈనెల 27 నుంచి రాగుల కొనుగోలు చేపట్టాలని ఆదేశించారు.జేసీ శివశ్రీనివాస్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, పౌరసరఫరాలశాఖ డీఎం గణేష్, డీఎస్‌వో శ్యామ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి నందు, సంజీవని, నేచర్ సంస్థ ప్రతినిధులు దేవుళ్లు, గౌరీ శంకరరావు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచాలి

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



విద్యార్థుల బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, పీవో చైతన్య

చింతూరు: విశాఖపట్నంలో జరిగే క్రీడాపోటీల్లో చింతూరు డివిజన్‌కు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచాలని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ ఆకాంక్షించారు. జన జాతీయ గౌరవదివస్‌లో భాగంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్న బస్సును ఆయన ఐటీడీఏ పీవో కావూరి చైతన్యతో కలసి జెండా ఊపి ప్రారంభించారు. జన జాతీయ గౌరవదివస్‌లో భాగంగా చింతూరు ఐటీడీఏ పరిధిలో నిర్వహించిన వాలీబాల్, జావెలిన్ త్రో, ఆర్చరీ, పెయింటింగ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరచిన 35 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరంతా ఈనెల 23 నుంచి 26 వరకు విశాఖపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారు.

24 నుంచి 'అయ్యప్ప మహా సంగమం'

• ఏయూ మైదానంలో 26 వరకు ప్రత్యేక పూజలు
• వివరాలు వెల్లడించిన పూజా కోర్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య

సీతంపేట: పూర్ణ పుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ పర్యవేక్షణలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు ఏయూ గ్రౌండ్‌లో అయ్యప్ప మహా సంగమం కార్యక్రమం నిర్వహించనున్నట్టు పూజా కోర్ కమిటీ చైర్మన్ ఎం.కృష్ణయ్య తెలిపారు. శంకర మఠంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24న స్థల శుద్ధి, గోపూజ, 25వ తేదీ ఉదయం 5.30 గంటలకు గణపతి హోమంతో పాటు ప్రత్యేక పూజలు చేస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు విలక్ పూజా మహోత్సవం, 26వ తేదీ తెల్లవారుజాము వరకు కేరళ నుంచి వచ్చిన మేల్ శాంతిలు, తంత్రిలు మలయాలంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మహిళలు, వృద్ధులు, వీఐపీలకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. పూర్ణపుష్కల అయ్యప్ప సేవా ట్రస్ట్ చైర్మన్ పైలా ఆదిమోహన్‌రెడ్డి మాట్లాడుతూ శంకర మఠంలో రోజూ జరుగుతున్న అన్నదాన కార్యక్రమం 25, 26 తేదీలలో జరగదని, ఏయూ గ్రౌండ్‌లో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ప్రచార సభ రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరిప్రసాద్, ట్రస్ట్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, ఎం.ప్రకాష్ పాల్గొన్నారు.

గురునాథరావు ఆశయాలు కొనసాగించాలి

22వ వర్ధంతి కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



గురునాథరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వైవీసుబ్బారెడ్డి

సీతమ్మధార (విశాఖ): దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు ఆశయాలు కొనసాగించాలని, ఆ శక్తి సామర్థ్యాలు ఆయన తనయుడు మంత్రి అమర్‌నాథ్‌కు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. గురునాథరావు 22వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఈ ప్రాంతానికి గురునాథరావు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. ఉత్తరాంధ్రలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఆయన చేసిన మంచిని చెప్పుకుంటున్నారన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి, వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. గురునాథరావు ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మంత్రి అమర్‌నాథ్ కొనసాగిస్తారని చెప్పారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల నాటి సమస్య పరిష్కారం



హక్కుదారుకు పట్టా పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పీవో అభిషేక్



పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

• అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
• 90 మంది రైతులకు జిరాయితీ పట్టాల పంపిణీ

అరకులోయ రూరల్: ఉన్నతాధికారుల సహకారంతో గిరి రైతుల దశాబ్దాల నాటి సమస్య పరిష్కారమైందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ పేర్కొన్నారు. మండలంలోని పెదలబుడు గ్రామ పంచాయతీ కేంద్రంలో బుధవారం లింబగూడ, బిస్సుంగూడ, గాడుగూడ, డొలిగూడ, నువ్వగూడ గ్రామాలకు చెందిన 90 మంది గిరిజన రైతుల జిరాయితీ భూములకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా ఆయా ప్రాంతాల రైతుల జిరాయితీ భూములకు పట్టాల్లేక ఇబ్బందులు పడేవారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పాలకులు పట్టాలిస్తామని ఎన్నికల సమయంలో వారిని నమ్మబలికారన్నారు. ఆ తరువాత పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యను గ్రామాల్లో పర్యటించినప్పుడు బాధిత రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అప్పటిలో వారికి ఇచ్చిన హామీ మేరకు పట్టాలు మంజూరు చేసి 50 ఏళ్ల సమస్యను పరిష్కరించామన్నారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ తదితర అధికారుల కృషితో ఇది సాధ్యమైందన్నారు.

పాడేరు ఐటీడీఏ పీవో మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించినప్పుడే నిజమైన సంతృప్తి కలుగుతుందన్నారు. ఒకేసారి అధిక సంఖ్యలో రైతులకు జిరాయితీ పట్టాలు పంపిణీ చేయడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. తహసీల్దార్ వేణుగోపాల్, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ సంపత్‌కుమార్, సర్పంచ్ దాసుబాబు, ఎంపీటీసీ భీమరాజు, శత్రుఘ్ను పాల్గొన్నారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం

అరకులోయ రూరల్: భవిష్యత్తులో టీడీపీ భూస్థాపితం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో గన్నెల పంచాయతీ కేంద్రంలో బుధవారం టీడీపీకి చెందిన సర్పంచ్ భూర్జ బొజ్జ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మూటి గోవింద్ వార్డు సభ్యులు సుర్జవతి, రాము, కళ, అచ్చవతి తదితరులు 20 మంది కార్యకర్తలతో కలిసి ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొజ్జ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోవింద్ మాట్లాడుతూ ఎమ్మెల్యే పనితీరు, జగనన్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు ప్రకటించారు. పార్టీ పటిష్టతకు మరింత కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంపీపీ ఉషారాణి, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, వైస్ ఎంపీపీ రామన్న, మండల కన్వీనర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ సందడి

• నేడు భారత్–ఆస్ట్రేలియా టీ–20 మ్యాచ్
• సిద్ధమైన వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం



టీ-20 మ్యాచ్‌కు సిద్ధమైన స్టేడియం



భారత్ కెప్టెన్ సూర్యకుమార్‌కు సూచనలిస్తున్న కోచ్ వీవీఎస్ లక్ష్మణ్

విశాఖ స్పోర్ట్స్: విశాఖలో క్రికెట్ సందడి నెలకొంది. వైఎస్సార్ ఏసీఏ- వీడీసీఏ స్టేడియం వేదికగా గురువారం రాత్రి 7 గంటలకు భారత్, ఆస్ట్రేలియా మొదటి టీ–20 మ్యాచ్ ప్రారంభం కానుంది. మ్యాచ్ కోసం ఇప్పటికే విశాఖ చేరుకున్న ఇరు జట్లు స్టేడియంలో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాయి. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు ఇప్పటికే హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా టికెట్ విక్రయించారు. ప్రపంచకప్ ఫైనల్‌లో భారత్ ఓటమి తర్వాత క్రికెట్ అభిమానులు చాలా డీలా పడ్డారు. ఆ ఓటమిని ఇంకా జీర్ణించుకోలేకపోతున్నారు. కీలక పోరు ముగిసిన తర్వాత జరుగుతున్న టీ–20 మ్యాచ్ కావడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. భారత జట్టు ప్రధాన ఆటగాళ్లకు విశ్రాంతినివ్వడంతో.. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో యువ క్రికెటర్లకు ఈ సిరీస్ గొప్ప సువర్ణావకాశం. ఐపీఎల్, ఇటీవల ఐర్లాండ్ టూర్‌లో విజృంభించిన కుర్రాళ్లు.. విశాఖ వేదికగా సత్తా చాటి జాతీయ జట్టులో బెర్త్ పదిలం చేసుకోవచ్చు. జోరు మీదున్న ఆస్ట్రేలియా జట్టును ఢీకొట్టి శుభారంభం అందించాలని అభిమానులు కోరుకుంటున్నారు. వరల్డ్ కప్ క్రికెట్ టైటిల్ సాధించి ఊపు మీదున్న ఆస్ట్రేలియా నాలుగు రోజుల వ్యవధిలోనే విశాఖ వేదికగా టీ20 సిరీస్‌కి సిద్ధమైంది. భారత్ తరఫున ప్రధాన ఆటగాళ్లంతా విశ్రాంతి తీసుకుంటుండగా.. ఆస్ట్రేలియా తరఫున కొందరు ఆటగాళ్లు తమ ఇళ్లకు చేరారు. ఫైనల్‌లో సత్తాచాటిన ఆస్ట్రేలియా ఆటగాళ్లు ఇప్పటికే విశాఖకు చేరుకుని నెట్స్‌లో శ్రమించారు. అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో పాటు అంతర్జాతీయ అరంగేట్రం చేసే కుర్రాళ్లు ఆస్ట్రేలియా తరఫున బరిలోకి దిగనుండగా.. ఆసియా కప్, ఐర్లాండ్ టీ–20 సిరీస్ మినహా పూర్తిస్థాయిలో మేజర్ టోర్నీలు ఆడిన అనుభవం లేని యువ భారత్ జట్టు వారితో ఢీ కొట్టనుంది. భారత్‌కు నాయకత్వం వహిస్తున్న సూర్యకుమార్‌కు, కోచ్‌గా వి.వి.ఎస్ లక్ష్మణ్‌కు ఇదే తొలి మ్యాచ్. ఈ మ్యాచ్‌లో భారత్ కుర్రాళ్లు శుభారంభం చేసి ఆధిక్యాన్ని ప్రదర్శించాలని అభిమానులు కోరుకుంటున్నారు.







మంచు కురిసే వేళలో..

విశాఖ– అరకు ఘాట్‌రోడ్డులో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. రెండురోజులుగా ఈ ప్రాంతంలో మంచు తెరలు దట్టంగా కమ్మేస్తున్నాయి. దీంతో వాహన చోదకులు కొంత మేర ఇబ్బందికి గురవుతున్నారు. అయితే పర్యాటకులు మాత్రం ఈ అందాలకు ఫిదా అవుతున్నారు.

– అనంతగిరి

జగనన్న ప్రభుత్వంలో రైతే రారాజు



మహిళకు స్టవ్ పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



పోచవరంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు

పెదబయలు: మండలంలోని సీకరి పంచాయతీలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ 485 మంది రైతులకు ప్రభుత్వం కల్పించిన శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో రైతులదే రాజ్యం అన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి, అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ఉజ్వల యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్‌లను అందజేశారు.

ఎంపీపీ వరహాలమ్మ, జెడ్పీటీసీ బొంజుబాబు, తహసీల్దార్ కృష్ణారావు, డీటీ వెంకటరమణ, వైస్ ఎంపీపీ రాజబాబు, నాయకుడు సూర్యనారాయణ, జీసీసీ మేనేజర్ గాసి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమం

కూనవరం: పోచవరం సచివాలయంలో మంగళవారం రాత్రి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, నాయకులు పల్లెనిద్ర కార్యక్రమాన్ని మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ పాలనలో గడప గడపకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జగనన్న పాలన దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

పోచవరం సచివాలయంలో పరిధిలో పథకాల ద్వారా 1900 మంది లబ్ధిదారులకు రూ.12.15 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు. ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ గుజ్జా విజయ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మరియాదాస్, మండల కన్వీనర్ కోటేశ్వరరావు, ఆరెకటిక రాష్ట్ర డైరెక్టర్ వెంకట్రామారావు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, సొసైటీ అధ్యక్షుడు కొండల రావు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పూర్ణానందం తదితరులు పాల్గొన్నారు.

28 ఆటోలపై కేసులు



నగరంలో ఆటోలు తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

గోపాలపట్నం: స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం సూచించారు. ఆటోలో ఆరుగురు విద్యార్థులను మాత్రమే తీసుకెళ్లాలన్నారు. ఈ క్రమంలో బుధవారం తనిఖీలు చేపట్టి నిబంధనలు పాటించని 28 ఆటోలపై కేసులు నమోదు చేశారు. పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్లే ఆటోలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లే విషయంలో తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. స్కూల్ సమయం కంటే ముందుగా సిద్ధం చేసి పంపించాలని తెలిపారు. ఇంటి వద్దే ఆలస్యం చేయడం వల్ల ఆటో డ్రైవర్ వేగంగా వెళ్లే అవకాశముందన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు.

బతుకు నావకు భరోసా

- ప్రమాదం జరిగిన 72 గంటల్లోనే పరిహారం
- రికార్డు సమయంలో ఆదుకున్న సీఎం వైఎస్ జగన్
- ఒక్కో బోటు యజమానికి 80 శాతం పరిహారం
- రూ.7.11 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బోటుపై ఆధారపడిన వారికీ ఆపన్న హస్తం
- వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఒక్కొక్కరికీ రూ.10వేల సాయం
- 480 మందికి అందజేసేలా ఏర్పాట్లు
- నేడు మంత్రి సీదిరి చేతుల మీదుగా పరిహారం అందజేత



ఘటనాస్థలం వద్ద ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

సాక్షి, విశాఖపట్నం: హుద్‌హుద్ విపత్తులో నష్టాల వలలో చిక్కుకున్న మత్స్యకారులకు పరిహారం అందించేందుకు టీడీపీ ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది. వందలసార్లు వినతులిచ్చి.. ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా తిరిగితే కానీ ఆదుకునేందుకు టీడీపీ ప్రభుత్వానికి మనసు రాలేదు. కానీ ప్రమాదవశాత్తూ జరిగిన ప్రమాదంలో రోడ్డున పడ్డ మత్స్యకార కుటుంబాలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి 72 గంటల సమయం పట్టలేదు. ఘటన జరిగిన వెంటనే దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం.. నష్టంలో 80 శాతం పరిహారం అందజేస్తామని వెంటనే ప్రకటించారు. చెప్పారంటే చేస్తారన్నది మరోసారి నిరూపించుకుంటూ.. బాధిత మత్స్యకారులకు గురువారం రూ.7.11 కోట్లు పరిహారం అందజేయనున్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో బోట్లు అగ్నికి ఆహుతై.. సర్వం కోల్పోయి మత్స్యకారులు రోడ్డున పడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించింది. ఎక్కడా లేని విధంగా ప్రమాదం జరిగిన వెంటనే పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. 72 గంటలు గడవకముందే పంపిణీ చేయాల్సిన సొమ్మును కలెక్టర్ ఖాతాకు జమ చేశారు. ఈ ప్రమాదంలో మొత్తం 30 బోట్లు పూర్తిగా దగ్ధమవ్వగా..18 బోట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటితో పాటు ఒక మత్స్యకారుడి వల కూడా ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయింది. విచారణ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం బాధిత మత్స్యకారుల జాబితాను సేకరించిన కలెక్టర్ డా.మల్లికార్జున నేతృత్వంలో జిల్లా యంత్రాంగం నివేదికను ప్రభుత్వానికి పంపించింది. నివేదిక పంపించిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం నుంచి పరిహారం సొమ్ము జిల్లాకు చేరుకుంది. నష్టంలో 80 శాతం అంటే.. మొత్తం రూ.7,11,76,000 అందించనున్నారు. ఈ మేరకు పూర్తిగా దెబ్బతిన్న 30 బోట్లకు రూ.7,21,50,000, అందులో ఉన్న వలలకు రూ.84.50 లక్షలు చొప్పున మొత్తం రూ.8,06,00,000 నష్టపోయినట్లు అంచనా వేశారు. ఇందులో 80 శాతం అంటే రూ.6,44,80,000ని 30 మంది బోటు యజమానులకు అందించనున్నారు. అదే విధంగా పాక్షికంగా దెబ్బతిన్న 18 బోట్లు, ఒక వలకు రూ.71.50 లక్షలు, బోట్లలో ఉన్న వలలకు రూ.12.20 లక్షలు చొప్పున మొత్తం రూ.83.70 లక్షలు నష్టం వాటిల్లినట్లు గణించారు. ఇందులో 80 శాతం రూ.66.96 లక్షలు అందించనున్నారు.

విచారణ వేగవంతం

అగ్ని ప్రమాద ఘటనపై దర్యాప్తు బృందం విచారణ వేగవంతం చేసింది. ఇప్పటికే పలువురిని అదుపులోకి తీసుకొని విచారించిన పోలీసులు.. బుధవారం కూడా మరికొంత మందిని విచారించారు. మొత్తం 30 మందిని విచారించిన పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టుకున్నారు. అదేవిధంగా ప్రమాదం జరిగిన సమయంలో హార్బర్‌లో మందు సేవిస్తున్న వారి వివరాలను కూడా సేకరించారు. ఆ సమయంలో ఎక్కడ ఉన్నారు.. వీరికి, ప్రమాదానికి ఏమైనా సంబంధం ఉందా అనే అంశాలపైనా విచారణ చేపడుతున్నారు. మరోవైపు.. ప్రమాదం జరగడానికి 15 నిమిషాల ముందు, ప్రమాదం జరిగిన తర్వాత 10 నిమిషాల సమయంలో ఫిషింగ్ హార్బర్ ప్రాంతంలో ఫోన్ నంబర్ల లొకేషన్ల ఆధారంగా ఎవరెవరున్నారనే వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం ఉదయం క్లూస్ టీమ్ ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించింది. మరోవైపు అగ్నిమాపక శాఖ అధికారులు కూడా వివరాలు సేకరిస్తున్నారు. సీసీ టీవీ ఫుటేజ్‌లో సేకరించిన వివరాల మేరకు రూమ్ నం .7కి ఎదురుగా ఉన్న బోటులో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందనీ జిల్లా దర్యాప్తు బృందం చెబుతోంది. రెండు మూడు రోజుల్లో పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి నివేదికను అందించేందుకు విచారణ వేగవంతం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ భరోసా ఇవ్వాలని..



ఊహకందని ఘోర ప్రమాదంలో వందలాది మంది మత్స్యకారులు రోడ్డున పడ్డారు. ప్రమాద ఘటనలో నష్టపోయిన ప్రతి ఒక్కరి కన్నీళ్లు తుడిచేలా భరోసా ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశించారు. ఈ మేరకు బోట్లు యజమానులతో పాటు వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారికీ సహాయం అందజేయాలని నిర్ణయించాం. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంత్రి సీదిరి అప్పలరాజు చేతుల మీదుగా గురువారం బాధిత మత్స్యకారులకు పరిహారాన్ని చెక్కుల రూపంలో అందజేస్తాం. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాల్ని దర్యాప్తు బృందం సేకరిస్తోంది. త్వరలోనే ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు అందనున్నాయి.

– డా.మల్లికార్జున, కలెక్టర్

బోటుపై ఆధారపడిన వారికీ..

కేవలం బోటు యజమానులే కాకుండా.. ఆ బోటుపై ఆధారపడే వారి గురించీ ప్రభుత్వం ఆలోచన చేసింది. సముద్రంలోకి వేటకు వెళ్తేనే ఆ పూటగడిచే పరిస్థితి ఉన్న హమాలీలు, చిరు వ్యాపారులు ఈ ప్రమాదం వల్ల ఉపాధి కోల్పోయారు. సాధారణంగా ఏ ప్రభుత్వమూ వీరి గురించి పట్టించుకునే పరిస్థితి ఉండదు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బోటుపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల్ని ఆదుకునేందుకు ముందుకొచ్చారు. ఒక్కో బోటుపై సుమారు 10 మంది చొప్పున ఆధారపడి జీవనం సాగిస్తుంటారనీ.. ఈ లెక్కన మొత్తం 48 బోట్లపై 480 మంది హమాలీలు, చిరు వ్యాపారులు ఆధారపడుతున్నారని అధికారులు నివేదిక సిద్ధం చేశారు. ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పంపిణీ చేయనున్నారు. ఇలా ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం పరిహారం అందించడం ఇదే ప్రప్రథమమని మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు డిఫారం పట్టాల పంపిణీ

సాక్షి, పాడేరు: స్థానిక కాఫీ అతిథి గృహంలో గురువారం మధ్యాహ్నం అర్హులైన గిరిజనులకు డిఫారం భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని పాడేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సిబ్బంది తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపడతారని మధ్యాహ్నం 3గంటలకు కాఫీ అతిథి గృహానికి స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

వై.వి.సుబ్బారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



వైవీ సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి, పాడేరు: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి బుధవారం విశాఖలోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఐనాడ ఘాట్‌లో వ్యాన్ లోయలోకి దూసుకుపోయిన ప్రమాద సంఘటనలో గిరిజనుడు నూకరాజు మృతి, పలువురు గాయాలయ్యారని తెలిపారు. చింతపల్లి అన్నవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో గెమ్మెలి నిత్య అనే బాలిక మృతి చెందిన విషయాలను వై.వి.సుబ్బారెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆయా బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

బైక్ ఢీకొని గాయపడ్డ వ్యక్తి మృతి

రాంబిల్లి: బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వెంకటాపురం గ్రామానికి చెందిన ఎస్.జోగినాయుడు(53) మృతి చెందినట్లు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. ఈ నెల 21న కూలి పనికి వెళ్లి, తిరిగి ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఢీకొట్టడంతో జోగినాయుడు తీవ్రంగా గాయపడ్డారు. తొలుత అతడిని అనకాపల్లి ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి సమయంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుని కుమారుడు ఉపేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రజా సమస్యలపై రాష్ట్రపతికి పోస్టుకార్డులు



చింతపల్లిలో రాష్ట్రపతికి పంపే కార్డులను చూపుతున్న అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం సభ్యులు

చింతపల్లిరూరల్: అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఆదివాసుల సమస్యలపై రాష్ట్రపతికి పోస్టు కార్డుల ద్వారా తెలియజేస్తున్న రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గిరి బుధవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకీలను గిరిజన తెగల్లో చేర్చడం సరికాదని, పోలవరం ముంపు బాధిత కుటుంబాలను ఆదుకోవాలని తదితర సమస్యలను కార్డులో పేర్కొన్నట్టు తెలిపారు. చిట్టినాయుడు, రామరాజు ,అచ్చిబాబు, మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు





తీవ్రంగా గాయపడిన లింగాచారి, శ్రీను

నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధి పెదబొడ్డేపల్లి శ్మశాన వాటిక వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. టౌన్ ఎస్‌ఐ సుధాకరరావు అందించిన వివరాలు.. మాకవరపాలెం మండలం, సీతన్నఅగ్రహారం గ్రామానికి చెందిన పి.శ్రీను(30) బైక్‌పై నర్సీపట్నం వచ్చి, తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. నాతవరం మండలం, వెదురుపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ లింగాచారి, తన సోదరుడు చినబాబుతో బైక్‌పై అనకాపల్లి వెళ్లి, తిరిగి వస్తున్నారు. పెదబొడ్డేపల్లి శ్మశాన వాటిక వద్దకు వచ్చేసరికి రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో శ్రీను, లింగాచారి తీవ్రంగా గాయపడ్డారు. చినబాబుకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. లింగాచారి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాడు-నేడుతో అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

హుకుంపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో నాడు–నేడు పనులపై సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా మండలంలో 67 అంగన్‌వాడీ కేంద్రాల్లో మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. సీడీపీవో బాలచంద్రమణి దేవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవకుమార్, ఎంఈవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా దూసుకొచ్చి.. లారీని ఢీకొట్టి..

- పిల్లలను ప్రమాదంలోకి నెట్టేసిన ఆటోడ్రైవర్ అతివేగం
- నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు
- బాధితులకు వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



తీవ్ర గాయాలపాలైన హాసిని ప్రియను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్



ప్రమాద స్థలిలో చెల్లాచెదురుగా రోడ్డుపై విద్యార్థులు



తలపై తీవ్రగాయంతో హాసిని ప్రియ



నుజ్జయిన ఆటో



చికిత్సపొందుతున్న విద్యార్థినులు

సీతమ్మధార : అంకుల్.. లారీ వస్తోంది చూడండి.. అని ఓ అమ్మాయి చెప్పినప్పటికీ.. ఆ భారీ వాహనాన్ని తప్పించుకుని ముందుకు వెళ్లిపోవాలని అతివేగంతో దూసుకొచ్చిన ఆటోడ్రైవర్ 8 మంది విద్యార్థుల భవిష్యత్‌ను ప్రమాదంలోకి నెట్టేశాడు. వీరిలో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం, మురళీనగర్, 104 ఏరియా ప్రాంతాలకు చెందిన హాసిని ప్రియ (15), వాణి జయ రమ్య (13), డి.లక్ష్య (8), జి.గాయత్రి (13), మరో నలుగురు విద్యార్థులు నగరంలోని బేతనీ స్కూల్‌లో చదువుతున్నారు. వీరు అదే ప్రాంతానికి చెందిన రాజు అనే వ్యక్తి ఆటోలో మూడేళ్లుగా స్కూల్‌కు వస్తున్నారు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం ఆటోలో స్కూల్‌కు బయలుదేరారు. అయితే అప్పటికే ఆలస్యం కావడం... వీరిని పాఠశాల వద్ద దించేసి, మరికొంత మంది విద్యార్థులను వేరే స్కూల్‌కు తీసుకెళ్లాల్సి ఉండడంతో డ్రైవర్ రాజు ఆటోను వేగంగా నడుపుతున్నాడు.

ఈ క్రమంలో వీరి ఆటో సంగం శరత్ థియేటర్ జంక్షన్ సమీపానికి వచ్చేసరికి, రైల్వే స్టేషన్ రోడ్డులో కాంప్లెక్స్ వైపు ఓ లారీ వస్తోంది. ఫ్లైఓవర్ సమీపానికి వచ్చేసరికి లారీ కనిపించడంతో ఆటోలోని హాసిని ప్రియ గమనించి... లారీ వస్తోందని గట్టిగా అరిచింది. అయినప్పటికీ ఆ లారీని దాటి ముందుకు వెళ్లిపోవాలని నిర్లక్ష్యంతో డ్రైవర్ రాజు ముందుకు దూసుకురాగా... అప్పటికే లారీ వచ్చేయడంతో దాన్ని ఢీకొట్టి ఆటో బోల్తాపడింది. ఒక్కసారిగా అందులోని విద్యార్థులంతా చెల్లాచెదురుగా రోడ్డుపై పడిపోవడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మిగిలిన నలుగురికి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఆటో నుజ్జునుజ్జయ్యింది. అదే సమయంలో ఆ మార్గంలో వెళ్తున్న ఓ ప్రైవేట్ హోటల్ మేనేజర్ వెంకటరావు స్పందించి స్థానిక యువకుడు శివ సహకారంతో తీవ్ర గాయాలైన హాసిని ప్రియ, వాణి జయ రమ్య, డి.లక్ష్య, జి.గాయత్రిని తన కారులో తీసుకెళ్లి సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో హాసిని ప్రియ తలకు తీవ్ర గాయమవడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేసి పర్యవేక్షణలో వుంచారు. మిగిలిన విద్యార్థులను రైల్వే ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వారిని డిశ్చార్జి చేశారు. ఆటో డ్రైవర్ రాజును కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాద స్థలాన్ని ద్వారకా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐలు ధర్మేంద్ర, అప్పలరాజు పరిశీలించి ఆటో, లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీసీపీ – శ్రీనివాసరావు సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

బాధిత విద్యార్థులకు పరామర్శ

లారీని ఆటో ఢీకొట్టిన ప్రమాదంలో గాయాలపాలైన విద్యార్థులను సెవెన్ హిల్స్ ఆస్పత్రికి వెళ్లి వైఎస్సార్ సీపీ రీజినల్ కో – ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పరామర్శించారు. పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని, అవసరమైన సేవలు అందించాలని వైద్యులను కోరారు. ఆయనతోపాటు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు, గొండు సీతారామ్, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ ఎం.ఆనందకుమార్, ట్రాఫిక్ పోలీస్ అధికారులు, డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు, డీఈవో చంద్రకళ, రోడ్డు రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ రాజారత్నం తదితరులు పరామర్శించారు.

త్రుటిలో తప్పిన ముప్పు



ప్రమాద స్థలిలో గుమిగూడిన స్థానికులు



గాయపడి విలపిస్తున్న విద్యార్థి

పీఎం పాలెం: స్కూలు పిల్లలను తీసుకెళ్లిన ఆటో బోల్తాపడడంతో మధురవాడ ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక భాష్యం స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లలను తీసుకుని బుధవారం ఉదయం ఆటో నగరంపాలెం రోడ్డులో వస్తుండగా... స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు బోల్తాపడింది. అందులో ప్రయాణిస్తున్న ఏడుగురు పిల్లలకు, డ్రైవర్‌కు స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు అప్రమత్తమై బోల్తాపడిన ఆటోను లేవదీసి, పిల్లలకు సపర్యలు చేశారు. గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అదృష్టవశాత్తూ అందరికీ స్వల్ప గాయాలు కావడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.